కథానిక

# ఎదురుచూడని ఆతిథ్యం

జి. వి. జి. కృష్ణ

"ఓహోహో! ఏమిటోయ్, ఎంతగా మారిపోయావ్—ఎంతగా మారిపోయావ్! నిన్ను గుర్తుపట్టలేకపోయానంటే నమ్ము."

"ఎన్నాళ్ళకెన్నాళ్ళకండీ."

"కొంతకూడా మారిపోయిందే! నిన్నరాత్రి బండికొచ్చావుటగా, ఖులాసా?"

"ఏదోలెండి-ఇలావున్నాను"

"రావోయ్, కాఫీపుచ్చుకుందాం"

"అబ్బే వద్దండీ, ఇప్పుడే తాగివస్తున్నా."

"అదో అదేవద్దన్నది. చిన్నప్పటి బుద్ధులను నువ్వింకా వదలినట్లు లేదు."

"సరే. మీరంతగా బలవంతం చేస్తున్నప్పుడు—"

"ముందు వద్దని తర్వాత సరే ననటం చిన్నప్పట్నించి అలవడిన బుద్ధేగా నీకు."

ఇద్దరూ కాఫీహోటల్ కెళ్ళారు.

"ఏమిటోయ్, మీ మద్రాసు విశేషాలూ?"

"ఏమున్నాయ్ లెండి. మీకు తెలియనివా?"

"ఇదేమిటోయ్, కొత్తగా "అండీ-గిండీ" అనటం మొదలెటావ్. చిన్నప్పుడు "మామయ్యా" అని పిలవటం మరచావా?"

"అబ్బే! లేదండీ."

"అదో మళ్ళీ."

"ఇలాగే అలవాటయిపోయిందండీ."

"దానికేంలేగానీ, మద్రాసు విషయాలేవో చెప్పవోయ్ అంటే."

"కొత్త విశేషాలేమున్నాయ్? అంతా మామూలే."

"చెప్పవోయ్, అక్కడ ఏమేం చేస్తూండే వాడివో."

"ఏంచేస్తూండినా...మా, చదువుకుంటూండినా."

నవ్వి "ఆ సంగతి నువ్వు చెప్పేదేవిటిగానీ, ఇతర సమయాల్లో ఏం చేస్తూండే వాడివీ అని నా ప్రశ్న."

"నేను ఆటలకూ, పాటలకూ ఎక్కడికీ పోనన్న సంగతి——"

"——నాకు తెలిసిందే. నువ్వు ఇంత చిన్న పిల్లవాడుగావున్నప్పట్నించీ నిన్ను ఎరిగినవాణ్ణే కదుటోయ్."

"తీరిగ్గా వున్నప్పుడల్లా "అభ్యుదయం" అని అయిదువందల పేజీలలో ఒక పుస్తకంరాసి అచ్చు వేయించాను."

"అలాగా. (సర్వరుతో) రెండు మిక్చర్"

"మళ్ళీ ఇదేవిటండీ?"

"నీకెందుకు-నువ్వుచెప్పవోయ్. ఊఁ, అచ్చు వేయించావు తర్వాత?"

"ఏం చెప్పనండీ. తీరా అచ్చువేయించే సరికల్లా ప్రభుత్వం దానిని బేన్ చేసేసింది."

"ఛుక్ ఛుక్ ఛుక్. అలాగా ఆఁ. మిక్చర్ పుచ్చుకో."

"తర్వాత పొద్దు పోనప్పుడల్లా పిక్చర్‌లో ఏక్టు చేసేవాడిని."

"ఏమిటీ-పిక్చర్లోకూడా నటించావన్న మాట. ఈసంగతి మా శారదకు తెలిస్తే ఎంత సంతోష పడుతుందో. మా శారదకు సినిమాలంటే పిచ్చి అన్న సంగతి నీకు తెలిసిందేగా. ఇంతకీ ఆదేం పిక్చర్?"

"తీరా చెప్పనివ్వండి. నాసీన్ షూటింగ్ అంతా అయిపోయి, పిక్చర్ సెన్సార్ వరకూ వచ్చే సరికల్లా, సెన్సార్‌వాళ్లు నేను నటించిన భాగాన్నంతా కట్ చేసేశారు."

"అరెరె"

"వాళ్లు సెన్సార్ చేస్తే నాకేం? నేను నటించిన భాగాలకంతా రంగుపూస్తే నాకేం? నాకు రావాల్సిన డబ్బేదో వచ్చేసింది."

"ఓహో! అలాగా...నయమే."

"ఆ వచ్చిన డబ్బుంతా, నేను పబ్లిష్‌చేసిన పుస్తకానికి ఆహుతియైంది. ఇదేదో కొత్త హోటల్‌లా వుందే?"

"ఆఁ. మొన్నటిన్నించే ప్రారంభమైంది."

"అన్నట్లు-స్వీట్లు బావుంటాయని యెవరో అన్నారు— ఈ హోటల్లో నేనా?"

"ఆఁ. బలే భేషుగా వుంటాయ్."

"నిజమే నంటారా?"

"ఆఁ. కావలిస్తే చూడు, నీకే తెలుస్తుంది. (సర్వరుతో) అయ్యర్ చూడూ! రెండు మైసూర్‌పాక్‌లు."

"చూశారూ అందుకే నేను రానన్నది."

"నువ్వు రాకపోతే వదిలేవాడి ననుకున్నావు టోయ్. ముక్కు తాడుకట్టి లాక్కొని రాలేనూ? చూడు మైసూర్‌పాక్ ఎలావున్నాయో మొహమాట పడకోయ్ తినూ. పర్వాలేదు లేవోయ్ తినూ, మద్రాసుకు మల్లే ఇక్కడ కల్తీ నెయ్యితో చేయరులే."

"అబ్బే. అందుకు కాదండీ, ఈ మైసూర్ పాక్ తింటే, నోరంతా తీపెక్కిపోతుంది. మళ్ళీ కాఫీ త్రాగాలంటే ఏదైనా కారం మళ్ళీ నోట్లో పడందే కానీ తాగటానికి వీలుండదు."

"దానికే మిటోయ్. కాస్త కారం నోట్లో వేసుకుంటే చాలు"—ఊఁ తినవోయ్. నీఅల్లుడి అలుక ఇప్పటిన్నించే మొదలెట్టొద్దు లే."

"అబ్బ! నిజంగా చాలా బావున్నాయండీ."

"నేను చెప్పలా. మద్రాసులో ఇలా చేస్తారా?"

"ఆబ్బే ఎక్కడండీ. అసలు వాళ్లు తయారు చేసేది మైసూర్‌పాక్ కాదు. అది మద్రాసు పాకే.

(పొట్టచెక్కలయ్యేటట్లు నవ్వుతూ)"నీ చిన్న నాటి చేష్టల్ని ఇంకా వదల్లేదోయ్ నువ్వు. అప్పుడప్పుడూ చలోక్తులను విసరటం ఇప్పటికీ మానలేదన్న మాట. (సర్వర్‌తో) రెండు కాఫీ"

"అనట్లు, కాఫీ రేటూ, కోకో రేటూ ఒకటే అనుకొంటా."

"అదో చూశావూ. మనకు రేట్లేమిటోయ్ రేట్లు. అందుకే నేనన్నది చిన్నప్పటి బుద్ధుల్ని నువ్వింకా వదల్లేదని"(సర్వరుతో)"ఆఁ, కాఫీవద్దు అయ్యర్. రెండు కోకో ఆఁ. ఎలా రాశావోయ్ పరీక్షల్లో?"

"ఒకవిధంగా రాశాన్లెండి."

"ఓ నువ్వు తప్పక పేసవుతావోయ్. నీ సంగతి నాకు తెలియదా ఏమిటి. ఇక్కడ వున్న నాళ్ళూ ఎలా చదివే వాడివి, రాత్రిబగళ్ళూ దీపాలార్పకుండా వెలగబెట్టేవాడివి చదువును. శారదకూడా చెప్తుండేంది నువ్వు అన్నిట్లోను ఫస్టని. అదీగాక మీ వంశంలో అందరూ విద్యావంతులే. ఊఁ, కోకో వచ్చేసింది పుచ్చుకో. ఇక్కడ ఇవికూడా బావుంటాయ్. వేడిగా వుందా ఏమిటి?"

"చక్కెర తక్కువగా వుంది."

"అయ్యర్! అయ్యర్! ఓ ఇక్కడేవున్నావా! కాస్త చక్కెర."

"ఐతే నీకు చక్కెర ఎక్కువగా వుండాలన్న మాట, మీ నాన్నగారికికూడా అంతే. కప్పు కాఫీలో అరకప్పుడు చక్కెరైనావుండాల్సిందే"

(సర్వరుతో) "కొద్దిగా వేయి. ఆఁ, చాలు చాలుచాలు." (కాస్త కోకో త్రాగి) "ఏన్నా అయ్యర్, చక్కెర ఎక్కువగా వేసేశావ్. పానకంలా తయారైంది."

"అయ్యర్! వెళ్ళి కాస్త కోకోపొడి, పాలూ తెచ్చి కలుపు, సరిపోతుంది. నీకు కాఫీ అలవాటున్నట్లు లేదు."

"లేకేమండీ. కానీఇలాటి సమయాల్లో ఎక్కువగా కోకోనే పుచ్చుకొంటాను."

"మా శారదకూడా అంతే. కాఫీని ఎక్కువగా తాగదు. కోకో అంటే అమిత ఇష్టం."

(సర్వరుతో) "ఊఁ,చాలుచాలు."(కోకోతాగి) "అబ్బ ఇప్పటికి సరిపోయింది. మంచి అయ్యర్‌వి నువ్వు—కప్పుకు రెండు కప్పులు తాగించావ్. ఆఁ బిల్ ఏదీ?"

"నాదగ్గర వుందిలే కానీ నువ్వు త్రాగు"

"అరే! బిల్లెప్పుడు ఇచ్చాడూ. హారి పిడుగా పిడికి నేరంత ఇదిగా వున్నానా?"

"నువ్వందరికీ ఇదిగానే వున్నావు కానీ త్రాగవోయ్. తర్వాత నీ చలోక్తులను విసుర్దువుగానీ లే. అన్నట్లు ఇంటికేనా?"

"లేదండీ బజార్లో కాస్త పనుంది. రెండు సూట్లుకు బట్టకొన్నాను. ఏ దర్జీ దగ్గరికైనా వెళ్ళి కుట్టేదానికి వేసి రావాలి."

"ఓ ఆసంచిలో వుండేవి అవేనన్న మాట. ఐతే నేనూ ఆలాగే వస్తాను. ఇద్దరమూ కలసి వెళ్ళొచ్చు."

"ఇంకా నాకు చాలా పనులున్నాయండీ. మద్రాసులో ఒక ఫ్రెండ్ చెక్ ఇచ్చాడు. దానిని మార్చాలని ఎన్నోనాళ్ళుగా ప్రయత్నిస్తున్నా. తీరికవుండి చావటంలేదు."

"దానికేమిటోయ్. బేంక్ లో ఖాతా వుందిగా నాకు. ఆ చెక్కు— ఏదీ ఇలా ఇవ్వు. కాష్ ఇచ్చేస్తాను."

"ఓ-యస్ ఇంటిదగ్గర ఇస్తాను లెండి. ఆc. ఇహా వెళ్దామా?"

"వెళ్ళక ఇంకా ఎంతసేపని అక్కడే కూర్చుంటాం?"

క్యాషియర్‌తో "ఏమండోయ్ డబ్బులు నేనిస్తాను. వారివద్ద పుచ్చుకోకండీ."

"అదో-అదే నేను వద్దన్నది. నీ చిన్ననాటి బుద్ధులు నిన్ను వదిలేటట్లు లేదు. చూశావా, ఈ కేషియర్‌కు తెలుసోయ్ ఎవరివద్ద డబ్బులు పుచ్చుకోవాలో అన్న సంగతి ఇదేమిటి ఈవైపు పోతున్నావ్?"

"ఓ సారీ మరచాను"

"ఊళ్ళు మారితే మనమూ మారుతుంటాం. అదికాదోయ్, ఒక్క ఏడాది వదలినంత మాత్రానికే మన ఊరిని మరచిపోతున్నామోయ్!" (నవ్వుతాడు).

"అప్పటికీ ఇప్పటికీ మన ఊరు కూడా మారింది నిజంగా. ఎన్నెన్నో కొత్త బిల్డింగులు అవతరించాయ్."

"నీకు తెలిసే వుంటుందనుకుంటా శారద ఈయేడు పాసయింది."

"అన్నట్లు ఇందాక మీరన్నప్పుడే ఆవిడ మీ కూతురు అయివుంటుందని అనుకున్నా నేను ఊహించింది నిజమే నంటారా?"


"నీ తమాషాలకేంగానీ, మీ నాన్న నీకు చెప్పలేదూ ఆ సంగతిని?"

"నాన్నా! నా న్నెక్కడున్నారూ? మా నాన్న పోయి ఎంతకాలమైంది".

"ఏమిటీ మీ నాన్న పోయారా. ఇలాటి విషయాల్లోనా పరిహాసం? నేనెంత ముఖ్యవిషయం మాట్లాడబోతున్నానో గమనించావా?"

"నేను ఎవ్వరితోనూ పరిహాసాలాడను. అందులో మీలాంటి పెద్దవారితో అసలే——"

"మరి తెల్లవారి విశ్వనాథంగారిని కలిస్తే



వాద్య విద్వాంసుడు శ్రీ ఇనుమర్తి సత్యనారాయణ. (సితార్ చేతిలో ఉన్నవారు) ఆరవ సంవత్సరం నుండీ సంగీతసాధన చేశారు. 1935 ఆంధ్రా యూనివర్సిటీ "వివిధ జంత్ర ప్రవీణ" బిరుదు యిచ్చింది. మొత్తం పదిహేను జంత్రములు వాయించగలరు. తరుచు విజయవాడ రేడియో నుండి మేండొలిన్ అను జంత్రము వాయిస్తారు. శ్రీ సత్యనారాయణగారు కాకి వాస్తవ్యులు.

ఇల్లాగ మద్రాసునించి నువ్వొచ్చావనికూడా చెప్పారు."

"విశ్వనాథంగారా? ఎవబ్బా ఆయన!"

"నువ్వు సూర్యప్రకాశం కాదేమిటి?"

"కాదండీ పొరపడి వుంటారు. నా పేరు పాపారావ్."

"అలాగా సూర్యప్రకాశమేమో అనుకొన్నా. అచ్చం సూర్యప్రకాశంలాగానే వున్నారు మీరు. ఇంతవరకూ మీరు సూర్యప్రకాశమే అనుకొంటూ వచ్చా."

"మానవులు పొరపాటు పడటం సహజమే కదండీ. ఇంతకీ దీనివల్ల వచ్చిన నష్టమేమీ లేదను కొంటా."

"క్షమించాలి మీకేమైనా——"

"అబ్బెబ్బె అలా అనుకోకండీ."

"థాంక్సు నేను వస్తానండీ పోస్టాఫీసువద్ద నాకు కాస్త పనుంది."

"నమస్తే"